ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 అనంతపురం జిల్లా వార్తలు
గురువారం 19 డిసెంబరు 2024



సెలవుపై వెళ్లిన కలెక్టర్



అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సెలవుపై వెళ్లారు. ఈ నెల 17నుంచి 31 వరకు కలెక్టర్‌కు సెలవు మంజూరు చేస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మంగళవారం నుంచే కలెక్టరు వినోద్‌కుమార్ సెలవులో వెళ్లిపోయారు. అయితే జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టరుగా జేసీ శివనారాయణశర్మకు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. వినోద్‌కుమార్ తిరిగి జాయిన్ అయ్యేవరకు జేసీనే ఇన్‌చార్జ్ కలెక్టరుగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

అదానీ ఫ్యాక్టరీలో ప్రమాదం

కూలర్ మరమ్మతులు చేస్తుండగా ఘోరం

కార్మికులపై పడ్డ నిప్పు కణికలు



బాధితుడిని పరామర్శిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ జగదీశ్

బెంగళూరుకు బాధితులు



డాక్టర్లతో మాట్లాడుతూ...

యాడికి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అదానీ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన నలుగురిని మెరుగైన వైద్యం కోసం బుధవారం రాత్రి బెంగళూరుకు తరలించారు. ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేసి బెంగళూరుకు తరలించారు. వారి వెంట వైద్య బృందాలు, రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. కాగా ఇదే ప్రమాదంలో గాయపడి, నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధి తులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ జగదీష్ పరామర్శిం చారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్మికులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వైద్య ఖర్చులను ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం భరిస్తాయని ఇన్‌చార్జ్ కలెక్టర్ తెలిపారు. ప్రమాద వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధితులను బెంగళూరుకు తరలించి, మరింత మెరుగైన చికిత్స అందిస్తామని ఇన్‌చార్జ్ కలెక్టర్ తెలిపారు.





గాయపడ్డ షణ్ముకానందరెడ్డి



దీపక్



ధర్మన్‌సింగ్



కంబగిరిరాముడు

ఒకరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు

అనంత, బెంగళూరుకు బాధితులు

తాడిపత్రి/యాడికి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం బోయరెడ్డిపల్లి సమీపంలోని అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. లైన్-2లో ఉన్న కోల్‌మిల్లులో కూలర్ మరమ్మతులు చేస్తుండగా ఇటుకలు విరిగి పడ్డాయని సమాచారం. అదే సమయంలో కూలర్‌కు రంధ్రాలు పడటంతో అందులో ఉన్న సెగలు కక్కేపొడి (నిప్పు కణికలు) కార్మికులపై పడ్డాయి. దీంతో పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన శివకేశవ(28) అక్కడికక్కడే మృతిచెందారు. యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన షణ్ముకానందరెడ్డి, చింతలాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరిరాముడు, బిహార్‌కు చెందిన ధర్మన్‌సింగ్, దీపక్, వికాస్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉన్న హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు.

ఆర్తనాదాలు...

సుమారు 400 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండే పౌడర్ మీద పడటంతో కార్మికుల శరీరంపై తీవ్ర గాయాలు అయ్యాయి. చర్మంపై బొబ్బలు వచ్చాయి. నొప్పిని భరించలేక కార్మికులు అల్లాడిపోయారు. ప్రమాదంలో మృతిచెందిన శివకేశవకు భార్య, కుమారుడు ఉన్నారు. విషయం తెలియగానే ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. శివకేశవ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఫ్యాక్టరీ వద్ద భారీ బందోబస్తు

ప్రమాదం గురించి తెలియగానే కార్మికులు, వారి బంధువులు భారీ ఎత్తున ఫ్యాక్టరీ వద్దకు తరలివచ్చారు. దీంతో ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. యాడికి సీఐ ఈరన్న సిబ్బందితో వెంటనే అక్కడికి వెళ్లి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. ఒకరు మృతిచెందడంతోపాటు ఐదుగురు గాయపడటంతో ఫ్యాక్టరీ వద్ద పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు భద్రతను పర్యవేక్షిస్తున్నారు. యాడికి, పెద్ద పప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి నుంచి పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు.



వివరాలు ఆరాతీస్తున్న సీఐ

వర్షాలతో జాగ్రత్త

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ



అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో రాబోవు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. రైతులు వాతావరణశాఖ సూచనలను పాటించాలని కోరారు. పంట కోతలు ఉంటే జాగ్రత్తపడాలని, ఆరబోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కణేకల్లు, శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, కల్లూరు వరి కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని, ధాన్యం తడవకుండా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించుకోవాలని రైతులకు సూచించారు.

భూముల మార్కెట్ విలువ పెంపు

భూముల మార్కెట్ విలువను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు, జడ్పీ సీఈఓ, సబ్ రిజిస్ట్రార్లు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. 2024 సంవత్సరానికిగాను గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో భూముల విలువలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఆ విలువలు ప్రజలకు తెలిసేలా రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో సమాచారం ఉంచాలని ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీస్ బోర్డులలో కూడా వివరాలు ప్రదర్శించాలని సూచించారు. విలువ పెంపుపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 24వ తేదీవరకు తెలియజేయవచ్చని అన్నారు. ఈ నెల 27న విలువల సవరణ కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాత ఆమోదం పొందుతాయని అన్నారు. పెంచిన విలువలు జనవరి 1వతేదీ నుంచి అమలవుతాయని తెలిపారు.



డి.హీరేహాళ్‌లోని తహసీల్దారు కార్యాలయం

అంతా ఆయనే..!

తహసీల్దారు కార్యాలయంలో తిష్ట

ఏళ్ల తరబడి పాతుకుపోయి.. పెత్తనం

కాసులు ఇవ్వనిదే ఫైలును కదల్చడు

డి.హీరేహాళ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే ఏదో ఒకరోజు సమస్యలు పరిష్కారమౌతాయని ప్రజలు భావిస్తారు. డి.హీరేహాళ్ మండలంలో తహసీల్దారు కార్యాలయానికి వెళితే కొత్త సమస్యలు వస్తున్నాయని మండల ప్రజలు భయపడుతున్నారు. కార్యాలయంలోని ఒక ముఖ్య అధికారి లేనిపోని కొత్త సమస్యలు సృష్టిస్తారని, వాటిని పరిష్కరించుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని బాధితులు అంటున్నారు. మండల కేంద్రానికి చెందిన ఆ అధికారి చాలా ఏళ్లుగా ఇక్కడే, రెవెన్యూ కార్యాలయంలోనే ఉంటున్నారు. వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తూ పాతుకుపోయారు. పది మంది వరకూ తహసీల్దార్లు బదిలీపై వెళ్లినా.. ఆయన మాత్రం కదల్లేదు. మండలంలోని అన్ని గ్రామాల రెవెన్యూ రికార్డులపై ఈయనకు పట్టుంది. ఇదే అతని బలం. కానీ ఈ బలాన్ని మంచికి వాడరట. సమస్యలను పరిష్కరించకుండా.. మీనమేషాలు లెక్కిస్తారట. బాధితులు వేడుకున్నా తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తారట. ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆయనలో మార్పు రావడం లేదని బాధితులు వాపోతున్నారు.

ప్రసన్నం చేసుకోవాల్సిందే..

ఎవరు ఏ పనిమీద వెళ్లినా ఆ అధికారిని ప్రసన్నం చేసుకోవాల్సిందే. లేదంటే ఏ పనీ జరగదట. తహసీల్దారు తరువాతి హోదాలో ఉన్న ఆ అధికారిని కాదని కార్యాలయంలో ఏ ఫైలూ ముందుకు కదలదట. ఎక్కడైనా కార్యాలయ ఉన్నతాధికారి ప్రమేయంతో ఫైళ్లు కదులుతాయి. సమస్యలు పరిష్కారమౌతా యి. కానీ ఇక్కడ ఉన్నతాధికారి కింది అధికారి పెత్తనం సాగుతోం ది. ఆధార్ కార్డు నుంచి వందల ఎకరాల భూ సమస్యల పరిష్కారం ఆయ న కనుసన్నల్లోనే నడుస్తోందని అంటున్నారు. సమస్యను బట్టి బేరం కుదుర్చుకుంటారని, అడిగినంత ముట్టజెప్పిన తరువాతే ఆ సమస్యను పరిష్కరిస్తారని ప్రచారం ఉంది. కాళ్లా వేళ్లా పడినా సమస్యలు పరిష్కారం కావని, కాసులు పట్టుకుని వెళితే పని జరుగుతుందని అంటున్నారు.

రియల్టర్లతో దోస్తీ

ఆ అధికారికి రియల్టర్లతో మంచి సంబంధాలు ఉన్నాయి. మైనింగ్, ఫ్యాక్టరీలు అధికంగా ఉండడంతో భూములకు మంచి విలువ ఉంది. నిత్యం భూముల కొనుగోలు, అమ్మకాలు జరుగుతుంటాయి. కొనేవారు, అమ్మేవారు, రియల్టర్లు రెవెన్యూ కార్యాలయాని భారీగా వస్తుంటారు. చాలా ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న ఆ అధికారికి రియల్టర్లు ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. ఆ అధికారిని కలిసి పనులు చేపించుకుంటున్నారు. విరామ సమయాలలో ఆయనకు బళ్లారిలోని పెద్ద పెద్ద హోటలల్లో విందులు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ ప్రత్యే క సమావేశాలు, కలయికలు ఉంటాయట. ఆ సమయంలోనే నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారం 50 శాతం రియాల్టర్ల పనులు ఆ భేటీలోనే జరిగిపోతుంటాయట. ఆయన ఫైల్‌పై సంతకం పెడితే పై అధికారి మారు మాట్లాడకుండా ఆమోదించాల్సిందే అంటున్నారు.



యాడికి మండల పరిషత్ కార్యాలయం

విచారణకు రండి..!

నాటి అధికారులకు జడ్పీ సీఈఓ నోటీసులు

ఎంపీడీఓ కార్యాలయంలో అవినీతి తేలేనా..?

యాడికి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు, ఎం. బుక్కులు మాయం, నిధుల దుర్వినియోగం గురించి అధికారులు విచారణ చేపట్టారు. బాధ్యులు తన కార్యాలయంలో గురువారం హాజరుకావాలని జడ్పీ సీఈఓ నుంచి ఆదేశాలు వచ్చాయి. యాడికి మండలంలో అప్పటి ఇన్‌చార్జి ఎంపీడీఓ (ప్రస్తుతం కనగానపల్లి) అనిల్‌కుమార్, అప్పటి సూపరింటెండెంట్ శంకరరావు, అప్పటి సీనియర్ అసిస్టెంట్ (వీఆర్‌ఎస్) గంగాధర్‌ను విచారణకు రమ్మని నోటీసులు ఇచ్చారు. ఈ నెల 5న అప్పట్లో ఎంపీడీఓగా పనిచేసిన కొండయ్య, ఈఓపీఆర్‌డీ (ప్రస్తుతం తాడిపత్రి రూరల్) వెంకటేష్ విచారణకు హాజరయ్యారు. విచారణ ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియని పరిస్థితి. తాజా విచారణకు అధికారులు వెళతారా..? గైర్హాజరవుతారా..? అన్న చర్చ జరుగుతోంది.

ఏం జరిగిందంటే..

2019-2020 నుంచి 2022-23 వరకూ యాడికి మండల పరిషత్‌కు రూ.కోట్లలో సీనరేజీ నిధులు జమ అయ్యాయి. ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారని, దీనిపై విచారించాలని ఫిర్యాదు వెళ్లింది. విచారణ అధికారి, గుంతకల్లు డీఎల్‌డీఓ యాడికి ఎంపీడీఓ కార్యాలయంలో అక్టోబరులో విచారించారు. ఆ సమయంలో గతంలో పనిచేసిన ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, పీఆర్ ఏఈలు వరప్రసాద్, ఆదినారాయణ రెడ్డి, అంజనేయులు, దేవకుమార్ హాజరయ్యారు. మరికొందరు అధికారులు గైర్హాజరయ్యారు. సాధారణ నిధులకు సంబంధించిన రికార్డులు, క్యాష్‌బుక్స్, ఓచర్స్ వర్క్‌లిస్ట్స్, మండల పరిషత్‌లో ఆమోదించిన తీర్మానాలు విచారణ సమయంలో సమర్పించలేదు. 2019-20లో సాధారణ నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్ మాత్రమే విచారణలో చూపించినట్లు తెలిసింది. 2019-23కు సంబంధించిన ఎటువంటి రికార్డులు ఇవ్వలేదు. 2019-23 మధ్యకాలంలో రూ.3,54,23,290 సీఎఫ్‌ఎంఎస్ ద్వారా లావాదేవి జరిపినట్లు విచారణలో తేల్చారు. ఈఎండీ ద్వారా జూన్ 9 2021న రామచంద్రారెడ్డికి రూ.50వేలు, జూన్ 19, 2021న రూ.2.50లక్షలు సెల్ఫ్‌గా, అదే ఏడాది జూలై 9న రూ.1.40 లక్షలు, జనవరి 20, 2022న రూ.7వేలు, జూన్ 19, 2024న రూ.26వేలు సెల్ఫ్‌గా డ్రా చేసుకున్నట్లు బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో గుర్తించారు. ఈఎండీ అమౌంట్‌ను కాంట్రాక్టర్ అభ్యర్థన మేరకు కాంట్రాక్టర్ ఇవ్వవలసి ఉంటుంది. వీటికి సంబంధించిన రికార్డులు కూడా ఎంపీడీఓ కార్యాలయంలో లేవని తేలింది. రికార్డులు సమర్పించడానికి 15రోజులు సమయం ఇచ్చారు. అయినా అధికారులు రికార్డులు ఇవ్వలేదని నివేదికలో పేర్కొన్నారు. రికార్డులు లేనందున పూర్తిస్థాయిలో విచారించలేకపోయామని నివేదికలో పేర్కొన్నారు. దీనికంతటికీ బాధ్యులైన అధికారులపై సీసీఏ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జడ్పీ సీఈఓకు డీఎల్‌డీఓ విజయలక్ష్మి నివేదిక ఇచ్చారు.



కక్కలపల్లి సమీపంలో రోడ్డు దుస్థితి

టమోటా మార్కెట్ సమీపంలో కంకర తేలిన రోడ్డు



ఏం రోడ్డప్పా ఇది..!

గుంతల రోడ్డే నయం

అధ్వానంగా మారిన కక్కలపల్లి ప్రధాన రోడ్డు

ప్యాచ్ వర్కుల ఆలస్యంతో కంకర తేలిన వైనం

అవస్థలు పడుతున్న వాహనదారులు

అనంతపురం రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఏం రోడ్డప్పా..! ఇది. గుంతలు ఉన్నప్పుడే మేలు. ఏందో నిదానంగా పొయ్యేవాళ్లం. రోడ్డు పనులు పూర్తిగా చేయకుండా వదిలేశారు. దారి పొడవునా కంకరతేలింది. జాగ్రత్తగా లేకపోతే బండి యాడ జారిపడుతుందో అనే భయం కలుగుతోంది' అని కక్కలపల్లి రోడ్డుపై రాకపోకలు చేసే వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కక్కలపల్లి ప్రధాన రోడ్డుకు ప్యాచ్ వర్కులు ఆలస్యం కావడంతో ఈపరిస్థితి వచ్చింది. గుంతలుంటే రోడ్డుకు అటో..ఇటో చూసి ప్రయాణం చేయడానికి వీలుంటుంది. ఇప్పుడు ఆపరిస్థితి కూడా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో నానా అవస్థలు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు బండి ఎక్కడ స్లిప్ అవుతుందోనని భయపడిపోతున్నారు. రోడ్డుపై తేలిన కంకర కారణంగా టైర్లు దెబ్బతిని పంక్చర్లు కావడం, లేదంటే ట్యూబులు పగిలిపోవడం జరుగుతున్నాయి. కంకర తేలినరోడ్డుపై ప్రయాణం చేసి ఒళ్లు హూనం అవుతోందని వాపోతున్నారు. ఈక్రమంలో ఆస్పత్రుల ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయంటున్నారు. రోడ్డు మరమ్మతుల పనులు ఎప్పుడు పూర్తవుతాయో..ప్రయాణ కష్టాలు ఎప్పుడు తీరుతాయో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.40 లక్షలతో మరమ్మతులు

ప్రభుత్వం ఇటీవల కక్కలపల్లి ప్రధానరోడ్డు మరమ్మతులకు రూ.40లక్షల నిధులు కేటాయించింది. ఈ నిధులతో కక్కలపల్లి క్రాస్ నుంచి కక్కలపల్లి, కాటిగానికాలువ మీదుగా పదికిలోమీటర్లు మరమ్మతు పనులు చేయనున్నారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు కూడా మొదలు పెట్టారు. గుంతలు పడ్డ చోట రోడ్డు చదును చేసి కంకర, కంకర డస్ట్ పరిచారు. అంతటితో పనులు ఆపేశారు. పనులు నిలిచిపోయి రెండు వారాలు కావస్తోంది. బీటీ దొరకకపోవడంతో పనులు ఆగిపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కాగా పనులు నిలిచిపోవడంతో మరమ్మతు పనులు చేపట్టిన చోటంతా కంకర తేలిపోయింది. ఆయా ప్రదేశాల్లో రాకపోకలు సాగించడానికి వాహనదారులు జంకుతున్నారు. అంతా అధ్వానంగా ఉంది పరిస్థితి. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణించిన వాహనదారులు వెనునొప్పి ఇతరత్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగే అక్కడ ఏర్పడే మట్టి ధూళితో శ్వాసకోస సమస్యలు తలెత్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కక్కలపల్లి క్రాస్‌లో నుంచి గ్రామంలోకి ప్రవేశించే వరకు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. టమోటా మార్కెట్ ఉండటంతో నిత్యం పెద్ద వాహనాలు వచ్చి వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆప్రాంతంలో చేపట్టిన మరమ్మతు పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

త్వరగా పూర్తిచేయిస్తాం



బీటీ సమస్య కారణంగా రోడ్డు మరమ్మతు పనులలు కొంత ఆలస్యం అయ్యాయి. ఒకటి, రెండురోజుల్లో మరమ్మతు పనులు తిరిగి ప్రారంభిస్తాం. పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం.

-కాటమయ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

మామిడి పంట ప్రీమియం గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌లో మామిడి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించేందుకు ఈనెలాఖరు దాకా గడువు పొడిగించినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా వాతావరణంలో వచ్చే మార్పుల మూలంగా పంటనష్టం జరిగితే ఆర్థిక నష్టం నుంచి రైతులను కాపాడేందుకు వాతావరణ ఆధారిత బీమాను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మామిడికి ఎకరాకు రూ.1650 ప్రీమియం చెల్లిస్తే రూ.33వేలు పంటల బీమా వర్తిస్తుందన్నారు. ఇదివరకు ఈనెల 15వతేదీ వరకు గడువు ఉండేదని, రైతుల సౌకర్యార్థం ఈనెలాఖరు దాకా ప్రభుత్వం పొడిగించిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


నగరోత్సవంలో అయ్యప్పస్వామి

నేత్రపర్వంగా అయ్యప్ప నగరోత్సవం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కో దండ రామాలయం ఆవరణలోని హరిహరసుత అ య్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సా యంత్రంస్వామి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో అయ్యప్పస్వా మికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో వినాయకుడు, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను ఉంచి, పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు జ్యోతులతో ముందు సాగుతుండగా... అయ్యప్పదీక్షధారులు శరణుఘోష, గీతాలాప నలతో పాల్గొన్నారు. బాణసంచా పేలుళ్లు, చెక్కభజనలు, దేవతా వేషధారుల సందడితో ఉత్సవం సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు, గురుస్వాములు లక్ష్మిరెడ్డి, రంగాచారి, మణికంఠ బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సోమర జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.


నగరోత్సవంలో పాల్గొన్న దీక్షధారులు

న్యూస్‌బాక్స్

21 నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో జరగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పా ట్లను పూర్తి చేశామని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగా రెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు వీరారెడ్డి, జయంత్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండు జట్ల క్రీడాకారులు గురువారం అనంత క్రీడా గ్రామానికి చేరుకుంటారు.

నేడు ఆటగాళ్ల పేర్ల నమోదు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి సీని యర్ ఫెన్సింగ్ పోటీలకు పేర్లను నమోదు చేసుకోనున్నారు. ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి అనంతపురం అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఆన్‌లైన్ పేర్ల నమోదు ప్రక్రియను నిర్వహిస్తా మని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ లక్ష్మి తెలిపారు. 18 సంవత్సరాలలోపు వయసు ఉండి, ఫెన్సింగ్‌లో ఆసక్తి, అర్హతగల క్రీడాకా రులు ఆధార్‌కార్డు, జననధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకా రులు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని తెలిపారు.

21న ప్రాజెక్ట్ కమిటీల ఎన్నిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలవ కమిటీ, భైరవాన్‌తిప్ప ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ ఈనెల 21న నిర్వహిస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. నగరంలోని హెచ్చెల్సీ కాలనీ లోక్ డివిజన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలి పారు. ఇప్పటికే సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక పూర్తి అయిందని అన్నారు. అసాధారణ సర్వ సభ్య సమావేశం, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు నామినేషన్ల స్వీకరణ, ఎన్ని కలు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన అదే రోజున ఉంటాయని తెలిపారు.

రైతన్నకు దిగులే..!

రబీలో వేరుశనగకు తెగుళ్ల బెడద
ఉధృతంగా ఆకుముడత, లద్దెపురుగు
ఆందోళనలో అన్నదాతలు


వేరుశనగ పంటకు సోకిన తెగుళ్ల

గుత్తిరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను తెగుళ్లు వదలడం లేదు. లేత దశలో ఉన్న వేరుశనగ పైరును అప్పుడే తెగుళ్లు చుట్టే శాయి. పైరుకు ఆకుముడత తెగులుతో పాటు లద్దెపు రుగు, మూతపురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందో ళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా బోరుబావుల కింద వెయ్యి ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. పంట సాగు చేసి 20నుంచి 25 రోజులు కావ స్తోంది. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్తపేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడి కొండ, రజాపురం, చేర్లోపల్లి, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటను బోరుబావుల కింద సాగు చేశారు. చీడపీడల నుంచి పంటను కాపా డుకునేందుకు పలు రకాల మందులను పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోంది. వాతావరణ మార్పులు, తుపాను దెబ్బకి పంటకు తెగుళ్లు సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతు న్నారు.


పంటకు ట్రాక్టరుతో మందు పిచికారీ చేస్తున్నరైతు

లద్దెపురుగు విపరీతంగా ఆశించింది



నేను 10 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. 20 రోజుల పైరును లద్దె పురుగు ఆశించింది. నివారణకు పురుగుల మం దు పిచికారీ చేశా. వాతావరణ మార్పుల కారణంగా వేరుశనగ పంటకు తెగుళ్ల ఉధృతి అధికమైంది. వాటికి తోడు తు ఫాను ప్రభావంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- రైతు శ్రీనివాస్ చౌదరి, ధర్మాపురం

ఆకుముడత తెగులు వ్యాపించింది



నేను రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఆకుము డత తెగులు వ్యాపించింది. ఒక సారి మందు పిచికారీ చేసిన ఫలితం లేదు. పంట సాగు చేసి 20 రోజులు గడిచినా వాతావ రణ మార్పుల వలన ఎదుగుదల కనబడటం లేదు. వాతావ రణం అనుకూలిస్తేనే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

- గోవిందు రైతు బసినేపల్లి తండా


పంటను ఆశించిన లద్దెపురుగు

వాతావరణ మార్పులతోనే..

వేరుశనగ పంటకు ఆకుముడత తెగులు ఆశించి ఉంటే ఎకరానికి 500 ఎంఎల్ క్లోరోపైరిపాస్, 300 గ్రాములు అస్పేట్ పొడి మందును పిచికారీ చేయాలి. లద్దెపురుగు నివారణకు ఎకరానికి నూవాన్ ప్లేస్, అస్పేట్ 100 గ్రాములు చెప్పున స్ప్రే చేయాలి. పురుగు ఉధృతంగా ఉంటే వారం రోజుల వ్యవధిలో మరో సారి పిచికారీ చేయాలి. వాతా వరణ మార్పుల కారణంగా పంటకు తెగుళ్ల సోకుతున్నాయి.

- ముస్తాక్ అహమ్మద్, వ్యవసాయాధికారి, గుత్తి

జగన్ బొమ్మ తీసేయండి

రీ సర్వే రాళ్లపై తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం
కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూ సర్వే పేరుతో జగన్ బొమ్మతో ముద్రించిన రాళ్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీసర్వేను ఆపేయడంతోపాటు అపుడు జరి గిన అవకతవకలును సరిదిద్దడానికి రెవెన్యూసదస్సులు నిర్వహిస్తోంది. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలను తొలగిం చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునా యుడు ఆదేశించారు.

అనంతలో 2,60,690 రాళ్లకు జగన్‌బొమ్మలు

వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకాన్ని 2020లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో భాగంగా జిల్లాలో తొలి విడతగా 198గ్రామాలలో 5,88,615ఎకరాలలో రీసర్వే చేపట్టారు. ఈగ్రామాలలో రీసర్వే అనంతరం హద్దులలో జగన్‌బొమ్మతో కూడిన 2,60,690 రాళ్లను నాటారు. ఈరాళ్లకు ఉన్న జగన్ పేర్లను తొలగించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంకో వైపు ఆసమయంలో రైతులకు జారీ చేసిన జగన్‌బొమ్మ తో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దుచేసి, ప్రభుత్వం ముద్రతో రూపొందించిన పుస్తకాలను అంద జేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన కలె క్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఇదేవిషయంపై ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈమేరకు వాటిన అమలు చేయడా నికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.


జగన్ బొమ్మలతో సరఫరా చేసిన రీసర్వే రాళ్లు (ఫైల్)

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

రీసర్వే విషయంలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటున్నాం, ఇప్పటికే సీఎం ఆదేశాలు ఇచ్చిన విషయం వాస్తవమే. జిల్లా కలెక్టరు, జేసీలు దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటారు. దాని ప్రకారం రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు, పేర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

-రూప్లానాయక్, ఏడీ, సర్వేశాఖ


మంచి రోజులు వచ్చినట్లేనా..?

మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు
మూడు దఫాలు తిరస్కరించిన వైసీపీ ప్రభుత్వం
ప్రస్తుతం రూ.14.65కోట్లతో అంచనాలు పంపిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మారిన పరిస్థితుల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ, జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈలు కలిపి రూ.14.65కోట్లతో ప్రతి పాద నలు పంపారు. కార్యాలయ నిర్మాణానికి అవసర మైన నిధులను ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా అందజేసే యోచ నలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

స్థలం కాజేసేందుకు వైసీపీ విఫలయత్నం

నగర నడిబొడ్డున రూ.కోట్ల విలువ చేసే సుమారు మూడెకరాల స్థలంపై గతంలో వైసీపీ పాలకులు కన్నే శారు. దాన్ని సొంతం చేసుకోవడానికి విఫలయత్నం చేశారు. ఈక్రమంలోనే రెండున్నరేళ్ల కిందట కురిసిన భారీ వర్షానికి శిథిలావస్థలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనం కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే కార్యాలయం మరమ్మతులు, నూతన భవనం నిర్మాణా నికి వైసీపీ ప్రభుత్వం యత్నించలేదు. పైగా ఆ స్థలాన్ని కాజేసేందుకు ఆ పార్టీ నేతలు యత్నించారు. వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి మొదట ఆ పార్టీ పెద్దలు ఈ స్థలంపై కన్నేయగా అది విఫలం కావడంతో హెచ్చెల్సీ కాలనీలోని స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో జలవనరుల శాఖ, మైనర్ ఇరిగేషన్ అధికారులు మూడు దఫాలుగా ప్రతిపాదనలు పంపినా తిరస్కరణకు గురైం ది. అయితే కూటమి ప్రభుత్వం కార్యాలయ ని ర్మాణానికి అంచనాలు పంపమని అధికారులను అడగ డంతో ఆశాఖ ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



కూలిన మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం (ఫైల్)

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

శిథిలావస్థకు చేరిన కార్యాలయం అసాంఘిక కార్యకలా పాలకు అడ్డాగా మారింది. పగలు పిచ్చాపాటిగా మాట్లా డుకునేందుకు, వాహనాల పార్కింగ్‌కు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అడ్డాగా మారింది. చీకటిపడితే మం దుబా బులు అక్కడికి మద్యం తెచ్చుకుని సేవిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ పీకలు కనిపిస్తున్నాయి. సరైన భద్రత లేకపోవడంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆదేశాలతోనే మైనర్ ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాం. రూ.14.65కోట్లతో జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ ద్వారా ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశాం. గతంలో కూడా ప్రతిపాదనలు పంపినా తిరస్కరించారు. ప్రధాన కార్యాలయం భవనం పైభాగం కుప్ప కూలింది. అయితే ఆ సమయంలో ఎవరూ కార్యాల యంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కార్యాల యంలోకి బయటవారిని రాకుండా చూసుకుంటున్నాం. కార్యా లయం పనివేళల తరువాత, సెలవు దినాలలో గేటుకు తాళం వేయాలని సూచించాం.



- విశ్వనాథ్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ


మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో బయట వ్యక్తుల వాహనాలు పార్కింగ్




కూలేందుకు సిద్ధంగా ఉన్న పైకప్పు


సీసీ రోడ్డు వేయకముందు పరిస్థితి

మారుతున్న రూపురేఖలు

ఉరవకొండ, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని ప్రధాన రోడ్డు అభివృద్ధి ఎట్టకేలకు ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం కింద రూ.12లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టింది. గతంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపైనే నిలబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వాహనదారుల అదుపు తప్పి కింద పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వా టీడీపీ నాయకులు చొరవ తీసుకుని సీసీరోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాగా డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన టీడీపీ నాయకులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.


సీసీ రోడ్డు వేసిన తర్వాత..

ఎన్ని కష్టాలో..!

బర్త్ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రుల అగచాట్లు

శెట్టూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ జనరేషన్‌కు అవసరమైన బర్త్ సర్టిఫికెట్ల కోసం తల్లిదం డ్రులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బర్త్ సరిఫికె ట్‌కు అవసరమైన పత్రాల కోసం మీ సేవ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగు తున్నారు. నోటరీ కోసం, మీసేవ కేంద్రంలో నమోదు కోసం వందలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పనులు వదులుకుని మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావ డానికి చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి అపార్ ప్రక్రి యను సరళీకృతం చేయాలని కోరుతున్నారు.

రూ.ఐదు వేలు ఖర్చయ్యాయి



జనన ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం రూ. ఐదు వేలు ఖర్చయ్యింది. అయినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి కాళ్లరి గిపోయాయి. ప్రభుత్వం స్పందిం చి అపార్ వ్యవహారాన్ని సులభతరం చేయాలి.

- చిరంజీవి, పర్లచేడు గ్రామం

ఓపిక నశిస్తోంది



ఇప్పటికే జనన ధ్రువీకరణ పత్రం కోసం, నోటరీ కోసం లాయర్ వద్దకు సబ్ రిజిస్ట్రార్ కార్యా లయం, సచివాలయం, తహసీ ల్దార్ కార్యాలయం, మీ సేవ ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగడానికి రూ. నాలుగు వేలు ఖర్చయ్యింది. ఇన్ని కార్యాలయాల చుట్టూ తిరగడా నికి ఓపిక నశిస్తోంది. అవసరం కాబట్టి తిరుగు తున్నాం.

- మంజునాథ, పర్లచేడు

రోజూ కందులు కొనాలి

నేటి నుంచే రైతుల పేర్లు నమోదు చేసుకోండి
ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన కందులను ప్రతిరోజు మార్కెట్ ధరకు కొనుగోలు చేయాలని అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టరు శివనా రాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్క్ఫె ఫెడ్, తదితరశాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లా డుతూ కందుల కొనుగోలు విషయంలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా, అందరిని సమన్వ యం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచే రైతుల పేర్లు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ, డీసీఓ, డీసీఎంఎస్‌లకు కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా కందులు కొనేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్‌లు, కొను గోలు కేంద్రాలవద్ద కార్యకలాపాలు సజావుగా జరిగేలా మార్క్ఫె ఫెడ్ అధికారులు చూడాలన్నారు. కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, కొనుగోలు చేసిన కందులను గోడౌన్‌లకు రవాణా చేయడానికి, భద్రపరచడానికి సర్వం సిద్ధం చేయా లన్నారు. కార్యక్రమలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్క్ఫెడ్ మేనే జర్ పెన్నేశ్వరి, మార్కెటింగ్ అధికారి సత్యనారాయణచౌదరి, జిల్లా సహకారఅధికారి అరుణకుమారి, డీసీఓ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీఆర్పీకి ఏబీసీడీ

సాంకేతిక అవార్డు


డీజీపీ నుంచి అవార్డును అందుకుంటున్న గుంతకల్లు జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే పోలీసులకు అబౌ అండ్ బియోండ్ ద కాల్ ఆఫ్ డ్యూటీ (ఏబీసీడీ) అవార్డు దక్కింది. విజయవాడలో బుధవారం జరి గిన అవార్డుల ప్రదానోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమల రావు చేతుల మీదుగా రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, ఆయన టీం సభ్యులు ఏబీసీడీ అవార్డును అందుకున్నారు. విధి నిర్వ హణలో సాంకేతికత వినియోగం, కేసుల పరిష్కారంలో సాధించిన ఫలితాలకు ఈ అవార్డులను ప్రకటించారు. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో గుంతకల్లు రైల్వే డివిజన్ రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరం మూడో స్థానంలో నిలి చింది. గుంతకల్లు డివిజన్ వరుసగా రెండుసార్లు అవార్డును సాధించడం విశేషం. సమష్టి కృషితో గుంతకల్లు రైల్వే పోలీసు జిల్లా విభాగం అవార్డును దక్కించుకుందని ఎస్పీ రాహుల్ మీనా అన్నారు.

వేతన ఖాతా ప్రయోజనాలపై అవగాహన

అనంతపురం క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల వినతి మేరకు వారి శాలరీ ప్యాకేజీపై (వేతన ఖాతా ప్రయోజ నాలు) అధికారులు అవగాహన సదస్సును నిర్వహించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు బుధవారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. హోంగార్డ్స్ దర్బార్‌లో ఈ నెల 6న ఎస్పీ జగదీ ష్‌కు హోంగార్డులు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పిం చారు. తమ బ్యాంకులోని శాలరీ అకౌంట్ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో బ్యాంకు అధికారులు వివరిం చారు.

● అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ విస్తరణ పనులకు పోలీసు అధికారులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో అద నపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా సీపీసీ భవనం పక్కనే విస్తరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమాలలో ఆర్ఐలు రాముడు, మధు, ఆర్ఎస్ఐ మగ్బూల్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం నాయకులు త్రిలోక్‌నాథ్, సూర్యకుమార్, హరినాథ్, తేజ్‌పాల్, ఆనంద్, లక్ష్మీనారాయణ, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, ఎస్బీఐ అధికారులు వేణుగోపాల్, రాఫెల్ రాజు, నవీన్ మురహరి తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఏఎస్పీ

క్రైం కార్నర్

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

తాడిపత్రి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని టెక్ కళాశాల వద్ద బుధవారం రాత్రి లారీ ఢీకొనడంతో లక్ష్మీదేవి (66) అనే వృద్ధురాలు మృతిచెందారు. లక్ష్మీదేవి టెక్ కళాశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. పనినిమిత్తం బయటకు వచ్చిన ఆమె.. రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

పామిడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సొరకాయలపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. సొరకాయలపేట ఆంజనేయులుకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇటీవల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించారు. పనులు చేయకపోయినా మస్టర్‌లలో పేర్లు నమోదు చేయాలని కొందరు అతనిపై ఒత్తిడి చేశారు. అలా చేస్తే సోషల్ ఆడిట్‌లో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆంజనేయులు అంగీకరించలేదు. దీంతో అతన్ని తొలగించాలని కొందరు నాయకులు పట్టుబట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రూ.లక్షకు పైగానే ఖర్చు చేశామని, తొలగిస్తే నష్టపోతానని, అవమానంగా ఉందని తన ఇంట్లోనే మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే పామిడి ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయులు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యయలు తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితుని భార్య సుభద్ర అధికారలకు విన్నవించారు.

చీరల దొంగ అరెస్టు

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ఇంట్లో చొరబడి, చీరలు దొంగలించిన కేసులో నిందితుడిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హెచ్చెల్సీ కాలనీకి చెందిన గుగ్గిళ్ల అనిల్‌కుమార్ సోషల్ సర్వీస్ పేరుతో ప్రజలకు చీరలు, గ్యాస్ స్టవ్స్, పుస్తకాలు పంచుతుంటారు. తన ఇంట్లోని ఔట్‌హౌస్‌లో వాటిని నిల్వ చేశారు. దొంగ చొరబడి మంగళవారం రాత్రి రూ.25వేల విలువైన చీరలను ఎత్తుకుపోయాడు. దీంతో అనిల్‌కుమార్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొదటి రోడ్డు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నిందితుడు, కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన వజ్రగిరి సాయిప్రసాద్‌ను అరెస్టు చేశామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

భర్తకు ఏడాది జైలు శిక్ష

భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష పడింది. నగరంలోని ఎర్రనేల కొట్టాలకు చెందిన శైలజకు అదే కాలనీకి చెందిన బత్తల సురేంద్రబాబుతో 2009 నవంబరు 27న వివాహమైంది. ఆ సమయంలో సురేంద్రబాబుకు 8తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. ఆ తరువాత రూ.1.50 లక్షలు అదనపు కట్నం తీసుకుని రావాలని సురేంద్రభార్యను వేధించాడు. దీంతో బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ నాగమధు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సాక్షులను విచారించి చార్జ్‌షీట్ వేశారు. ఈ కేసులో మొబైల్ కోర్టు జడ్జి సుజిన్ సాక్షులను విచారించి, బత్తల సురేంద్రబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు.

మెసేజ్ పంపి.. రూ.2 లక్షలు కాజేశారు..!

డి.హీరేహాళ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఫోన్ మెసేజ్ పంపి.. ఒక వ్యక్తి నుంచి రూ.2 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. ప్రముఖ కాంట్రాక్టర్ గొడిశలపల్లి హనుమంతరెడ్డి ఖాతా నుంచి రెండు రోజుల క్రితం ఈ సొమ్మును మాయం చేశారు. తన ఖాతాలో డబ్బులు జమ అయినట్లు టెక్స్ మెసేజ్ వచ్చిందని, ఆ డబ్బులు జమ అయ్యాయో లేదోనని చెక్ చేసుకునేందుకు టెక్స్ మెసేజ్‌పై నొక్కానని హనుమంతరెడ్డి తెలిపారు. ఆ వెంటనే తన ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారని, తన ఖాతా నుండి రూ.41 వేలు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చిందని తెలిపారు. కంగారు పడి తిరిగి పరిశీలించే లోపు రూ.1.4 లక్షలు, ఆ తరువాత రూ.20 వేలు తన ఖాతా నుంచి బదిలీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు. వెంటనే బ్యాంకుకు వెళ్లి తన ఖాతాను తాత్కాలికంగా నిలిపివేయించానని తెలిపారు. తన ఖాతాలో మిగిలిన రూ.7 లక్షలను కూడా సైబర్ నేరగాళ్లు కాజేసేందుకు ప్రయత్నించారని, బ్యాంక్ మేనేజర్ వెంటనే ఆ ఖాతాను బ్లాక్ చేశారని తెలిపారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

టీడీపీ మండల కన్వీనర్‌పై వైసీపీ వర్గీయుల దాడి

హిందూపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ చిలమత్తూరు మండల కన్వీనర్ రంగారెడ్డిపై వైసీపీకి చెందిన వారు బుధవారం దాడి చేశారు. హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి స్వగ్రామమైన చిలమత్తూరు మండలంలోని పెద్దన్నపల్లిలో ఇంటి ముందు ఉండగా, వీధిలో అటుగా వెళ్తున్న వైసీపీకి చెందినవారు కవ్వింపు చర్యకు పాల్పడ్డారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. వైసీపీకి చెందిన వెంకటరాముడు, మరో ముగ్గురు కలిసి రంగారెడ్డిపై దాడి చేశారు. దీంతో రంగారెడ్డి నుదిటిపై రక్తగాయమైంది. వెంటనే ఆయన హిందూపురం ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వెంకటరాముడు, మరి కొంతమంది చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఉండగా.. పలువురు అక్కడికి వెళ్లి వారిపై దాడికి యత్నించారు. పోలీసులు.. వారిని అడ్డుకుని, అక్కడి నుంచి పంపించేశారు.

వైసీపీ నాయకుడిపై దాడి

తాడిపత్రి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు కాశీ మనోజ్‌ను కిడ్నాప్‌చేసి, దాడి చేశారని పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. కాశీ మనోజ్ వైసీపీలో చురుగ్గా ఉండేవారు. దీన్ని మనసులో పెట్టుకొని జూటూరు రవితోపాటు మరికొంతమంది బుధవారం అతన్ని కిడ్నాప్ చేసి దాడిచేశారని కాశీ మనోజ్ చిన్నాన్న కాశీ విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు, తన స్నేహితుడు అనిల్ పెళ్లికి బుధవారం వచ్చి, సంధ్య థియేటర్ వద్ద కాఫీ తాగుతుండగా రవితోపాటు మరికొందరు వాహనంలో వచ్చి కిడ్నాప్ చేశారు. రావివెంకటాంపల్లి వద్దకు తీసుకువెళ్లి దాడి చేసి, వదిలిపెట్టి వెళ్లారు. బాధితుడు బంధువులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ దాడిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాశీమనోజ్‌ను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, వేమనాథ్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాశీమనోజ్ నార్పలలో ఉంటున్నారు.

రక్షకులు ఏరీ..?



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత.. ఎస్ఐ పోస్టు ఖాళీ.. సీఐపై పనిభారం

1.5 లక్షల జనాభాకు 15మంది పోలీసులు

సిబ్బంది నియామకాన్ని పట్టించుకోని ఉన్నతాధికారులు



తాడిపత్రి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అత్యంత సమస్యాత్మక ప్రాంతం తాడిపత్రిని పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో నేరాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారు. చివరికి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవడానికి కూడా తగిన సిబ్బంది ఉండటం లేదు. ఈ ప్రాంతంలో రాజకీయ సంఘర్షణ వాతావరణం నెలకొని ఉండటంతో ఇక్కడికి రావడానికి పోలీసు అధికారులు జంకుతున్నారు. వచ్చిన అధికారులు నెల, రెండునెలలు పనిచేయడం కూడా గగనమైంది. తరచూ పోలీసు అధికారులు మారుతుండటంతో నేరాల నియంత్రణ సక్రమంగా జరగటం లేదు. పట్టణంలో ఇటీవల పెరిగిన దొంగతనాలే ఇందుకు నిదర్శనం.

ఏడాదిన్నరలో ఆరుగురు సీఐలు

ఏడాదిన్నర వ్యవధిలోనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో దాదాపు ఆరుగురు సీఐలు మారారు. ఏడాది న్నర కిందట సీఐగా ఆనందరావు దాదాపు 10నెలలు విధులు నిర్వహించాడు. ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో ఆ స్థానంలో హమీద్‌ఖాన్ బాధ్యతలు చేపట్టారు. వివిధ ఆరోపణలతో ఐదు నెలలకే అతడిని ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. తర్వాత ఈ స్థానంలో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ట్రైనీ డీఎస్పీగా ఉన్న హేమంత్‌కుమార్ రెండు నెలలపాటు సీఐ విధులు కూడా నిర్వహించారు. అనంతరం సీఐగా వచ్చిన మురళీకృష్ణను ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలకు బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. తర్వాత రోజుల వ్యవధిలోనే నాగేంద్రప్రసాద్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. కానీ ఈయన కూడా ఒత్తిళ్లు భరించలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో సీఐగా ఇస్మాయిల్ బాధ్యతలు స్వీకరించారు. అయితే పదిరోజులకే నాగేంద్రప్రసాద్ తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ధర్మవరానికి బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం సీఐగా సాయిప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ ఎస్ఐ స్థాయి అధికారి ఒకరు కూడా లేకపోవడంతో సీఐపై పనిభారం పెరిగింది.

సెక్షన్ డ్యూటీ ఎత్తివేత

ఎన్నికల ముందు సెక్షన్ డ్యూటీలుగా నియమించేవారు. ఏ, బీ,సీలుగా విభజించి డ్యూటీలు వేసేవారు. సిబ్బంది కొరత వల్ల సెక్షన్ డ్యూటీలను పూర్తిగా తీసివేశారు. పోలీసులకు గతంలో నాలుగు బీట్‌లు వేసేవారు. ప్రస్తుతం స్పెషల్‌పార్టీ, ఇతర పోలీస్ స్టేషన్‌ల నుంచి సిబ్బందిని రప్పించి రెండు బీట్‌లు వేస్తున్నట్లు సమాచారం. మండలంతోపాటు పట్టణంలో రెండు బీట్లే ఉండటంతో దొంగతనాలు ఎక్కువయ్యాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల శీతకన్ను

పట్టణ పోలీస్‌స్టేషన్‌పై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు శీతకన్ను వేసినట్లు అగుపిస్తోంది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ముగ్గురు ఎస్ఐలు విధులు నిర్వహించారు. అప్పట్లో ఎలాంటి దొంగతనాలు, రాజకీయ దాడులు ఇతర సమస్యలు ఏర్పడలేదు. ప్రస్తుతం సీఐతోపాటు ఏఎస్ఐలు ముగ్గురు, హెడ్‌కానిస్టేబుళ్లు ఆరుగురు, కానిస్టేబుళ్లు 15మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంఖ్య పట్టణ జనాభాకు ఏమాత్రం సరిపోదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎస్ఐ పోస్టు ఖాళీ

దాదాపు ఐదునెలల నుంచి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈ స్థానం భర్తీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. 1956 నిబంధనలను అనుసరించి పట్టణ జనాభా ప్రకారం పోలీస్‌స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 10మంది, కానిస్టేబుళ్లు 42మంది ఉండాలి. పట్టణ జనాభా ప్రస్తుతం 1.5లక్షలు దాటింది. పాత నిబంధనల ప్రకారం కూడా ఇక్కడ పోలీసు సిబ్బంది లేరు. ఎస్ఐ స్థాయి అధికారి లేకపోవడంతో వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక వెనుదిరిగి పోతున్నారు. ప్రస్తుతం ఒక సీఐ, ఏఎస్ఐలు ముగ్గురు, హెడ్‌కానిస్టేబుళ్లు 8మంది ఉన్నారు. కానిస్టేబుళ్లు 21మంది ఉండగా ఇందులో ముగ్గురు పది రోజుల కిందట వీఆర్‌పై వెళ్లారు. ముగ్గురు డెప్యుటేషన్‌పై వెళ్లారు. మిగిలిన 15మందిలో ఇద్దరు కంప్యూటర్, ఇద్దరు కోర్టుకు, ఇద్దరు సెంట్రీ, ఇద్దరు రిసెప్షన్‌లో ఉంటారు. మిగిలిన ఏడుగురు మాత్రమే పట్టణంలో తిరగాల్సి ఉంటుంది.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


వాలీబాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న విద్యార్థులు

క్రీడాస్ఫూర్తి నింపడమే ధ్యేయం

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- హోరాహోరీగా పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ (ఐపీఎస్‌జీఎం-2024)ను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. క్రీడా జ్యోతిని వెలిగించి శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాలలో బాలుర వసతి గృహ నిర్మాణానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశపెట్టేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన వాలీబాల్‌తో పోటీలను ప్రారంభించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు కప్‌లను అందజేస్తామని ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. విజయం సాధించిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ జడ్పీటీసీ సభ్యుడు సాకే చంద్ర, టీడీపీ నాయకులు జయరాంనాయుడు, అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేఖర్, రాంబాబు, బాలుచంద్రానాయక్, రఘురామరెడ్డి, నిత్యలావణ్య, అనిత, సుధారాణి, రాధిక పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌తో పాటు 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, ధర్మవరం, గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు అనంతలక్ష్మి, పీవీకేకే, గేట్స్, టెక్ ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు పోటీపడ్డారు. విద్యార్థుల ఈలలు, కేరింతల నడుమ పోటీలు రసవత్తరంగా సాగాయి. వీటిలో బాలుర విభాగం చెస్ పోటీల్లో అనంతపురం ప్రభుత్వ కళాశాల విద్యార్థి అఫ్జల్, తాడిపత్రి సీవీఆర్ఐటీ అఖిలేష్‌రెడ్డి, పీవీకేకే సోమేష్‌కుమార్ విజయాన్ని సాధించారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో విద్యార్థులు అనంతపురం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కిరణ్, ఉదయ్ విన్నర్స్‌గా నిలిచారు. ఉరవకొండ ప్రభుత్వ కళాశాల వెంకటప్రసాద్, ఆజమ్‌ఖానా రన్నర్స్‌గా మిగిలారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఉరవకొండ ప్రభుత్వ కళాశాల విద్యార్థి వెంకటప్రసాద్, అనంతపురం ప్రభుత్వ కళాశాల కిరణ్ విజయాన్ని సాధించారు.


అనంతలక్ష్మి, ధర్మవరం కళాశాల విద్యార్థుల మధ్య ఖోఖో


చెస్ పోటీల్లో ఎత్తుకు పైఎత్తువేస్తున్న విద్యార్థులు


పోటాపోటీగా పరుగు పందెం

క్రీడ పేరు	విద్యార్థి	కళాశాల
చెస్	సుమశ్రీ అమృత వైష్ణవి	ధర్మవరం ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల
టేబుల్ టెన్నిస్(డబుల్)	అర్పిత, అమృత కుసుమ, మేఘన	అనంతపురం ప్రభుత్వ కళాశాల(విన్నర్స్) పీవీకేకే కళాశాల(రన్నర్స్)
టేబుల్ టెన్నిస్(సింగిల్)	అర్పిత మీనాక్షి	అనంతపురం ప్రభుత్వ కళాశాల(విన్నర్స్) హిందూపురం ప్రభుత్వ కళాశాల(రన్నర్స్)
షార్ట్‌పెట్	శిల్ప, అపర్ణ లిఖిత	హిందూపురం ప్రభుత్వ కళాశాల పీవీకేకే కళాశాల
డిస్కస్ త్రో	శిల్ప భవ్యశ్రీ పుష్పలత హర్షిత	హిందూపురం ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల పీవీకేకే కళాశాల
లాంగ్ జంప్	భూమిక శ్రీలేఖ మీనాక్షి	మడకశిర ప్రభుత్వ కళాశాల తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల
ట్రిపుల్ జంప్	భూమిక విజ్ఞతి, త్రివేణి	మడకశిర ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల
హైజంప్	భూమిక చంద్రకవిత అనిత	మడకశిర ప్రభుత్వ కళాశాల అనంతపురం ప్రభుత్వ కళాశాల హిందూపురం ప్రభుత్వ కళాశాల

బాత్రూం డోర్ అనుకుని..

రైలు మెయిన్ డోర్ తెరిచి..

కింద పడి బీటెక్ విద్యార్థి మృతి


నిఖిల్‌కుమార్ రెడ్డి (ఫైల్)

ధర్మవరంరూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థి రైలులో బాత్రూం డోర్ అనుకుని పొరబాటున మెయిన్ డోర్ తెరిచి, బయటకు అడుగుపెట్టాడు. కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మరణించాడు. మండలంలోని పోతుకుంట గ్రామానికి చందిన శ్రీనివాసరెడ్డి, సుధ దంపతుల కుమారుడు నిఖిల్‌కుమార్ రెడ్డి (21). ధర్మవరం మండలం తుమ్మల గ్రామ సమీపాన బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మరణించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. నిఖిల్‌కుమార్ రెడ్డి చెన్నైలో బీటెక్ సెకండియర్ చదువుతుండేవాడు. సెమిస్టర్ పరీక్షలు రాసి స్వగ్రామానికి బయల్దేరాడు. అందులో భాగంగా తిరుపతికి చేరుకున్నాడు. అక్కడి నుంచి తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు ఎక్కాడు. తెల్లవారుజామున తుమ్మల గ్రామ సమీపంలోకి రాగానే కాలకృత్యాలు తీర్చుకునేందుకు నిఖిల్‌కుమార్ రెడ్డి బాత్రూం డోర్ అనుకుని పొరబాటున రైలు ఎక్కే మెయిన్‌డోర్‌ను తెరిచాడు. బయటకు కాలుపెట్టడంతో పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిఖిల్ కుమార్ రెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డికి ఫోన్‌చేసి, ప్రమాద విషయం తెలిపాడు. తండ్రి హుటాహుటిన ప్రమాదస్థలానికి వెళ్లి, కుమారుడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ నిఖిల్‌కుమార్ రెడ్డి మృతిచెందాడు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మేడ మీద నుంచి పడి మహిళ మృతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీ కాలనలో మేడ మీద నుంచి ప్రమాదవశాత్తు పడి సావిత్రమ్మ(40) మరణించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకంఠపురం ఎస్సీ కాలనీకి చెందిన సావిత్రమ్మ బీబీ కాలనీలో ఇంటి పనులు చేసేది. బుధవారం మేడ మీద ఇంటి పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడింది. శబ్దం రావడంతో ఇంటి యజమాని బయటికి వెళ్లి చూడగా.. సావిత్రమ్మ కింద రక్తపు మడుగులో పడి ఉంది. విషయాన్ని సావిత్రమ్మ కుటుంబీకులకు తెలిపారు. ఆటోలో హిందూపురం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సావిత్రమ్మకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు.

బాబయ్య దర్గా పీఠాధిపతిగా సలావుద్దీన్‌బాబా


దర్గా నూతన పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా (కుడి)

పెనుకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పట్టణంలోని బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతిగా నజీర్‌హుస్సేని ఉరుఫ్ సలావుద్దీన్‌బాబా మంగళవారం రాత్రి బాధ్య లు తీసుకున్నారు. ప్రస్తుత పఠాధిపతి తాజ్‌బాబా పెద్ద కుమారుడు సలావుద్దీన్‌బాబా. వివిధ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, మతపెద్దలు, ప్రముఖుల ఆధ్వర్యంలో తాజ్‌బాబా.. సలావుద్దీన్ బాబాకు పీఠాధిపతిగా బాధ్యతలు అప్పజెప్పారు. నూతన పీఠాధిపతికి గజమాల వేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

విద్యార్థికి తీవ్రగాయాలు

గోరంట్ల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా.. ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి.


బైక్‌ను ఢీకొన్న బస్సు



మహేష్‌నాయక్ మృతదేహం, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్‌నాయక్

గోరంట్ల మండలంలోని పుట్టపర్తి రహదారిలో గుంతపల్లి గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ద్విచక్రవాహనాన్ని బుధవారం రాత్రి కేఎస్ఆర్టీసీ ఢీకొన్న ప్రమాదంలో మహేష్‌నాయక్ (24) మృతిచెందగా, విద్యార్థి రాజేష్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లి తండాకు చెందిన బాబ్‌జీనాయక్ పెద్దకుమారుడు మహేష్‌నాయక్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన గోపేనాయక్ కుమారుడు రాజేష్‌నాయక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వారిరువురు ద్విచక్రవాహనంపై గోరంట్లకు పనినిమిత్తం వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామానికి బయల్దేరారు. గార్మెంట్స్ పరిశ్రమ ముందు పుట్టపర్తి నుంచి బెంగళూరు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో మహేష్‌నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రవంగా గాయపడిన రాజేష్‌నాయక్‌ను గోరంట్ల ఆస్పత్రికి తరలించారు. అపస్మార స్థితిలో ఉండగా మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో వ్యాపారి..

పెనుకొండ రూరల్: మండలంలోని ఈశ్వర్ రబ్బర ఫ్యాక్టరీ సమీపాన 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కియ బస్సు ఢీకొన్న ప్రమాదంలో వ్యాపారి షేక్ అన్వర్ బాషా (59) మరణించాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుకొండ పట్టణంలోని నారాయణమ్మ కాలనీకి చెందిన అన్వర్ బాషా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా తోపుడుబండిపై బజ్జీలు వేసుకుని, జీవనం సాగించేవాడు. ద్విచక్రవాహనంలో మంగళవారం సాయంత్రం సోమందేపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్ద వెనుకవైపు నుంచి కియ కార్మికులను తరలించే బస్సు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అన్వర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108 సాయంతో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్వర్ బాషాకు ఇద్దరు కుమారులున్నారు. అతడి సోదరుడు షేక్ చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జవాబుదారీగా పనిచేయండి

● అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఏ కార్యాలయంలోనూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని, ఇప్పుడూ అలాగే వ్యవహరిస్తామంటే కుదరదని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. నిర్లక్ష్యం వీడి, ప్రజలకు జవాబుదారీ తనంతో పనిచేయాలని సూచించారు. మండలంలోని గంగినేపల్లిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న భూసమస్యలపై పలువురు రైతులు ఎమ్మెల్యేకి అర్జీలు అందజేశారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మాజీ మంత్రినైనా తాను కార్యాలయాలకు వెళ్లినా గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు కనిపించకుండా పోయేవారన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, అయితే కొందరు అధికారులు గతంలో మాదిరిగానే ని ర్లక్ష్యంగా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంలోనే గంగనపల్లికి చెందిన పలువురు రైతులు, గ్రామానికి తారు రోడ్డు చాలా దారుణంగా ఉం దని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాను రెవెన్యూ సదస్సుకు వస్తూ రోడ్డు పరిస్థితిని చూశానని ఎమ్మెల్యే అన్నారు. గ్రామానికి నూతనంగా తారురోడ్డు వేసిన తరువాతే గ్రామానికి వస్తానని ఎమ్మెల్యే తెలుపగా గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

'సెమీ కండక్టర్లతో ఉపాధి మెండు'

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ల తయారీపై నైపుణ్యాలు పెంపొందించుకునే విద్యార్థులకు విరివిగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల అధ్యాపకురాలు ఉమాదేవి పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించిన బుధవారం స్కిల్ హవర్ కార్యక్రమంలో ఉమాదేవి మాట్లాడారు. ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు సెమీ కండక్టర్ కీలకమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ట్రైనింగ్ ఆఫీసర్లు, శిక్షణాధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం సాయంత్రం సంకష్ట చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీగణపతి మందిరంలో హనుమత్ సమేత గణనాథుడి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన గరిక, కుడుములను నివేదించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మణికంఠబాబు, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాల అభివృద్ధికి ప్రాధాన్యం

● మేయర్ వసీం

అనంతపురం క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని మతాల శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో హెచ్చెల్సీ కెనాల్ సమీపంలోని ముస్లిం శ్మశాన వాటికను బుధవారం ఆయన డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అశోక్‌నగర్‌లోని ముస్లిం శ్మశాన వాటికకు రూ.67లక్షలతో ప్రహరీ, రూ.17లక్షలతో లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, కమల్‌భూషణ్, మునిశేఖర్, అబూసాలెహ, ఈఈ రాధాకృష్ణ, ఏఈ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

క్రిస్టియన్లకు ప్రభుత్వం అండ

● త్వరలో పాస్టర్లకు వేతన బకాయిల విడుదల

● ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


ప్రీ క్రిస్మస్ వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే, అసోసియేషన్ సభ్యులు

అనంతపురం రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని రాచానపల్లిలోని యేసు కృపా మందిరంలో బుధవారం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాస్టర్లతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రిస్టియన్లకు ఏసాయం కావాలన్నా ముందుంటానన్నారు. పాస్టర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలపై సీఎం చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకున్నారని, త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉందన్నారు. అసోసియేషన్‌లో ఉన్న పాస్టర్లు, సభ్యులు, పేద క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుకగా ఉచితంగా నిత్యవసర సరుకులు, వస్త్రాలు, నగదును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో హైదరాబాదు ఎవెంజెలిస్ట్ పాస్టర్ గాడ్లి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మార్కు, సహాయకార్యదర్శి మనషే, ఆనంద్, కోశాధికారి జీవన్‌బాబు, రూఫస్, శాంతవర్ధన్, జహంగీర్ జాఫువా,లాబాన్ టీడీపీ, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్బన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో బుధవారం అయ్యప్ప స్వామి భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హాజరయ్యారు. ముందుగా అయ్యప్ప మాలధారులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామికి ఎమ్మెల్యే హారతినిచ్చారు. మాలధారులకు అన్న ప్రసాదం అందజేశారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి

అనంతపురం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో గళం వినిపించడం సంతోష కరమన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి వడ్డెర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే జనవరి 11వ తేదీన వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వడ్డే ప్రసాద్, గంగరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు అందించండి

● వ్యవసాయాధికారులను కోరిన రైతులు


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ శశికళ

అనంతపురం రూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): సబ్సిడీతో ట్రాక్టర్ వ్యవసాయ పనిముట్లు అందజేయాలని పలువురు రైతులు వ్యవసాయాధికారులను కోరారు. మండలంలోని కక్కలపల్లి, కాటిగాని కాలువ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శశికళ హాజరై గ్రామాల్లో సాగు చేసిన కంది, వేరుశనగ, ఉలవ ఇతరత్ర పంటలను పరిశీలించారు. కంది పంటకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలు రైతులకు వివరించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... ట్రాక్టర్‌కు అమర్చే వ్యవసాయ పనిముట్లు ఇతరాత్ర వాటిని సబ్సిడీతో అందించాలని కోరారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లామని, వచ్చిన వెంటనే అందిస్తామని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మురళీ కృష్ణ, రైతు సేవా కేంద్రం సహాయకులు, కిషోర్‌కుమార్, దేవేంద్ర, కక్కలపల్లి సర్పంచు క్రిష్టయ్య, రాజశేఖర్, శ్రీరాములు, క్రిష్టయ్య, రామాంజినేయులు, చంద్రశేఖర్, పుల్లయ్య, మారుతి, శ్రీనివాసులు, ఓబులేసు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల నుంచి తొలగించండి

● రెవెన్యూ సదస్సులో పలువురు రైతుల వినతి

అనంతపురంరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చుక్కల భూముల కింద న మోదైన తమ భూములను, వాటి నుంచి తొలగించాలని పలువురు రైతులు రెవెన్యూ అధికారులను కోరారు. మండలంలోని ఆలమూరులో బుధవారం రూరల్ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ మంజునాథ్ ఆధ్వర్యం లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి 20 ఫిర్యాదులు వచ్చాయి. ఇందు లో చుక్కలు భూములు, మిగులు భూముల నుంచి తొలగించాలని 11ఫిర్యాదులు అందా యి. అలాగే రస్తా సమస్య, భూమి కొలతల పై మరో తొమ్మిది ఫిర్యాదులు అధికారులకు అందాయి. వాటిని పూర్తి విచారించి పరిష్క రిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్‌కృష్ణ, వీఆర్వోలు, గ్రామ టీడీపీ నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేటి నుంచి రైల్వే గేట్ బంద్

గార్లదిన్నె, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని డ్యాం రోడ్డు సమీపంలో ఉన్న రైల్వే గేటును నాలుగు రోజులు బంద్ చేస్తున్నట్లు రైల్వే ఇంజనీర్ రవిబాబు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ... రైల్వే గేటు, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో గురువారం నుంచి ఈ నెల 22 వరకు రైల్వే గేటు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి ప్రయాణించే వాహనదారులు. ప్రయాణికులు, రైతులు ప్రత్యామ్నాయంగా రైల్వే గేటు పక్కనున్న దారి ద్వారా వెళ్లాలన్నారు. ఇందుకు అందరు సహరించాలని కోరారు.

సభ్యత్వ నమోదుకు విరాళం


ఎమ్మెల్యేకి విరాళం అందజేస్తున్న జయప్రకాష్

అనంతపురం అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలతో టీడీపీ సభ్యత్వ నమోదు చేయించేందుకు ఐదో డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకుడు జయప్రకాష్ నారాయణ రూ.50వేలు విరాళం ఇచ్చారు. బుధవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు ఆయన ఇంటి వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణను అభినందించారు. అనంతపురం అర్బన్‌లో టీడీపీ సానుభూతిపరులుగా ఉండి సభ్యత్వాలు చేసుకోలేకపోతున్న పేదవారిని గుర్తించి, విరాళాల ద్వారా చేయించాలని సూచించారు. కొన్ని డివిజన్లల్లో సభ్యత్వాల సంఖ్య తక్కువగా ఉందని, మనం అనుకున్న లక్ష్యం చేరేందుకు కష్టపడి పనిచేయాలన్నారు.

కంపచెట్లను తొలగించండి

శింగనమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల శ్మశాన వాటికల్లో కంపెట్లు తొలగించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని తరిమెల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ భాస్కర్ మాట్లాడుతూ... గ్రామంలో శ్మశాన వాటిక సమస్యలు, రెవెన్యూ సమస్యలపై అధికారులకు విన్నవించారు. తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలకుమారి, సర్వేయర్ స్టీఫెన్ రైతుల నుంచి అర్జీలు స్వీక రించారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని సీపీ ఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జిల్లా పరిషత్ కొత్తహాల్‌లో పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ రచించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, 'విద్వేష రాజకీయాలు'ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, 'అసమానతలు ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని బడ్జెట్ విశ్లేషకు డు సత్యబోస్ ఆవిష్కరిస్తారన్నారు. వామపక్షవాదులతో పాటు అన్నివర్గాల మేధావులు, ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

● నవయుగ కాలనీ వాసుల వినతి


కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని నవయుగ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నవయుగ కాలనీ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బుధవారం సోములదొడ్డి సచివాలయం వద్ద సచివాలయ కార్యదర్శి అన్నపూర్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... కాలనీ ఏర్పడి దాదాపు పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పక్కా గృహాలు మంజూరు కాలేదన్నారు. కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా నవయుగ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నవయుగ కాలనీ కమిటీ సభ్యులు హరి, జాఫర్, శెక్షావలి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి: డీఈఓ


మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. జనవరి 4న ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీఎత్తున్న చేపట్టనున్న హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక కార్యక్రమాన్ని బుధవారం స్థానిక లలితకళా పరిషత్‌లో నిర్వహించారు. హనుమాన్ చాలీసా ప్రచార సమితి, పవన యువజన సేవాట్రస్టు సం యుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి దాదాపు 56 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి డీఈఓ ప్రసాద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. లలితకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ, ఆకుల రాఘవేంద్ర, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు పుల్లారెడ్డి, రవికుమార్, శ్రీనాథ్, నాగరాజు, రవిచంద్రారెడ్డి, రమణారెడ్డి, హనుమాన్ చాలీసా ప్రచార సమితి సభ్యులు మురళి, సత్యనారాయణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బాలాజీ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హెటిరో ఫార్మాస్యుటికల్స్ కంపెనీ ఉద్యోగాలకు బాలాజీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ కంపెనీ ప్రతినిధులు బుధవారం కళాశాలలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు హాజరుకాగా, 16మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపా రు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, కళాశాల యాజమాన్య సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్నివిధాలా ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రాంగణ నియామకాల ఇన్‌చార్జ్ వెంకటేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులను భర్తీ చేయండి

● సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, ప్రకాష్, ఇర్ఫాన్ తదితరులు బుధవారం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావును కలిశారు. వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లను ప్రస్తుతం 200కు పెంచారన్నారు. పైగా బోధనా సుపత్రికి రోజుకు రెండు వేల మందికిపైగా రోగులు చికిత్స కోసం వస్తున్నారని, 12 వందల మంది వరకు ఇన్‌పేషెంట్లు వైద్యసేవలు పొందుతున్నారన్నారు. అలాంటపుడు సరిపడా అధ్యాపకపోస్టులును భర్తీ చేయాల్సింది పోయి, ఉన్న 33 ట్యూటర్ పోస్టులను పక్క కళాశాలలకు సర్దుబాటు చేయడం సరికాదన్నారు.

సెమీస్ దశకు క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్‌కళాశాల క్రికెట్ పోటీలు సెమీస్ దశకు చేరాయి. ఆర్డీటీ స్టేడియంలో బుధవారం పోటీలు కొనసాగాయి. గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజీపై ఎస్వీ డిగ్రీ కాలేజ్ అనంతపురం జట్టు గెలుపొందింది. తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై అనంతపురం వివేకానంద కాలేజీ జట్టు విజయం సాధించింది. శ్రీవాణి డిగ్రీ కళాశాలపై ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల జట్టు గెలుపొందింది. అనంతపురం ఆర్ట్స్ కాలేజీపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. లీగ్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజ్, అనంతపురం వివేకానంద డిగ్రీ కాలేజీ, ఎస్వీ డిగ్రీ కాలేజీ, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజ్‌లు సెమీస్‌కు చేరాయి. సెమీ ఫైనల్స్ గురువారం జరుగుతాయి.

21న జాబ్‌మేళా

నార్పల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నార్పల పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డెవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో విశ్వదర్శన్ అకాడమీ, ఎయిర్‌టెల్ టెలికామ్ లాంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9010039901 నంబరులో సంప్రదించాలని సూచించారు.

డివిజనల్ అధ్యక్షుడిగా పరమేశ్వర

రామగిరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్‌మన్ పరమేశ్వర ఉమ్మడి జిల్లా విద్యుత్ 1104 యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతపురంలోని విద్యుత్ కళాభారతిలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 1104 విద్యుత్ డివిజన్ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజనల్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా అక్రమ్‌బాషా, సెక్రటరీ రవీంద్రరెడ్డి ఎన్నికయ్యారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తాం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నార్పల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలే తమకు ప్రాధాన్యమని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. హెచ్ఎల్‌సీ కాలువను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ప్రయోజనాలే ముఖ్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. చెరువులన్నింటిని నీటితో నింపుతామని, అందులో ఎలాంటి సందేహాలకు తావు లేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందన్నారు. సాగునీటి కాలువలు దెబ్బతిన్నాయని వాటికి మరమ్మతులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, మాజీ ఎంపీటీసీ ఆకుల ఆంజనేయులు, సౌత్ కెనాల్ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, వైస్ చైర్మన్ చంద్రాయుడు, టీడీపీ నాయకులు ఆకుల ఇంజనేయులు, ఆకుల విజయకుమార్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

యూపీలో అనంతవాసుల ప్రతిభ


కౌసల్య బృందాన్ని అభినందిస్తున్న మంత్రి స్వతంత్రదేవ్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్(యూపీ) రాష్ట్రంలోని సుందర్‌వన్‌లో అనంతవాసులు కోలాట ప్రదర్శనలో ప్రతిభ చాటారు. సుందర్‌వన్‌లో జరుగుతున్న 180 అడుగుల భారీ శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు బుధవారం యూపీ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి స్వతంత్రదేవ్ సింగ్‌జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా అనంతపురం నుంచి వెళ్లిన ఓం సంగీత నృత్యకళానిలయం నాట్యాచార్యురాలు దేవర కొండ కౌసల్య బృందం కోలాట ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శనల అనంతరం మంత్రి స్వతంత్రదేవ్ సింగ్‌జీ కౌసల్య బృందాన్ని అభినందించారు.

'వైసీపీ కక్షసాధింపులే కొనసాగిస్తారా?'

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్‌పై సాగించిన కక్షసాధింపులను కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగిస్తారా? అని ఆర్ఈఎఫ్ రాష్ట్ర నాయకుడు ఉజ్వల్ బుధవారం ఆయన ప్రకటనలో మండిపడ్డారు. విద్యాశాఖ ఏపీఓ, ఏఎస్ఓ పోస్టుల్లో రిజర్వేషన్ వర్గాలకు చెందిన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులకు అడ్డంగా కట్టబెట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అదే తంతు కొనసాగించడం ఏంటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ తలపెట్టిన ప్రజాప్రభుత్వ విధానం అందని ద్రాక్షగా మారుతోందని వాపోయారు. వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాసిన అధికారులనే కీలక బాధ్యతల్లో కొనసాగించడం ద్వారా ఏపీఓ, ఏఎస్ఓ పోస్టులు అక్రమార్కులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులను నియమించకపోతే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వ్యర్థాలతో సంపద సృష్టించాలి

● జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సత్యనారాయణ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను తిరిగి వినియోగించుకుని సంపద సృష్టించే పద్ధతులను కనుగొనాలని జేఎన్‌టీయూ కెమికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఏఐసీటీఈ, అటల్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి కొనసాగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగ కాలం ముగిసిన తరువాత వస్తువు వ్యర్థంగా మారుతుందన్నారు. ఇలాంటి వ్యర్థాలను మరో రూపంలోకి మార్చి తిరిగి వినియోగించేలా పరిశోధనలు జరగాల్సిన అవసర ముందన్నారు. ఉత్పత్తి ప్రక్రియలో వాయు, ద్రవరూపంలో వెలువడే వ్యర్థాలను ప్రకృతికి హానికరంగా మారకుండా కొత్త విధానాలు అమలులోకి తీసుకురావాలన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యా లు అనే అంశంపై ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన 17ఎస్‌డీజీఏ పద్ధతి ప్రపంచ పురోగతికి దోహదపడుతుందని ఎస్కేయూ ప్రొఫెసర్ నాగ భూషణరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలనరసయ్య, దిలీప్‌కుమార్, విభాగాధిపతి కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపం క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మైనార్టీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. జాతీయ మైనార్టీ దినత్సవం సందర్భంగా లోక్ అదాలత్ కోర్టు హాలులో మైనార్టీ హక్కుల గురించి బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అందుబాటులో ఉన్న పథకాను ఉపయోగించుకుని ప్రస్తుత పరిస్థితి నుంచి మెరుగైన స్థితికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప, మైనార్టీ అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

అనంతపురం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఇన్‌చార్జి కలెక్టరు శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల నిధులు, వ్యయం, మౌలిక వసతుల గురించి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ పథకంలో ఎస్సీలకు 17.08 శాతం, ఎస్టీలకు 5.53 శాతం నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని, ఆ నిధులను ఖర్చు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిష్పత్తి ప్రకారం రెగ్యులర్ డీలర్‌షాపులను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని అన్నారు. మెప్మా, ఉద్యాన పథకాల లబ్ధి చేకూరేలా అవగాహనలు పెంచాలన్నారు. సమీక్షలో ఆర్డీఓ కేశవనాయుడు, సంక్షేమశాఖల అధికారులు ప్రతాప్ ఎసూర్యనారాయణరెడ్డి, రామాంజినేయులు, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వనజా అక్కమ్మ, డ్వామా పీడీ సలీమ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చీనీలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం

గార్లదిన్నె, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చీనీ తోటలనుసాగు చేసే రైతులు నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలని రేకులకుంట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. గార్లదిన్నెలో ఉద్యాన కార్యాలయంలో ఆ శాఖ అధికారి రత్నకుమార్ ఆధ్వర్యంలో చీనీ రైతులకు నూతన యాజమాన్యం పద్ధతులపై బుధవారం శిక్షణ ఇచ్చారు. చీనీ పంటకు సోకే తెగళ్ళ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. తెగులు సోకిన చెట్టుకు నీరు పెట్టిన మరుసటి రోజే ఒక శాతం బోర్డు మిశ్రమం, కార్బండిజమ్‌ను 2 గ్రాములు, 1 లీటరు నీరు, మందు ద్రావణం 20 లీటర్లు చెట్టు చుట్టు పోయాలని అన్నారు. వేసవిలో తెగలు సోకిన చీనీచెట్ల చుట్టూ ఎండు ఆకులు, వరి, వేరుశనగ, పెసర, మినప పొట్టుతో 2, 3 అంగులాలు మందంగా వేస్తే.. నేలలో తేమ ఉంటుందని అన్నారు. వేరు ఎండు కుళ్ళు తెగులు నివారణకు ట్రైకోడెర్మా కల్చరు మిశ్రంను ఒక కిలో కల్చరు, 90 కిలోల ఎరువు, 10 కిలోల వేపపిండి, వారంరోజులు నీటిలో వేసి గోనె సంచులతో పచ్చరొట్టతో కప్పి బాగా మగ్గబెట్టి చెట్టుకు 10 కిలోల చొప్పున వేయాలని అన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే
చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం
- సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు సన్మానం


సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కాలువలు, చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గంలోని సాగునీటి సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టీసీ సభ్యులకు అభినందన సభను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం సాగు నీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సాగునీటి సంఘాలను తీసుకొచ్చారన్నారు. కూటమి అభ్యర్థులు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యకులు, టీసీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చారిత్రాత్మకమన్నారు. చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు, టీసీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ గుంతకల్లు, గుత్తి ఇన్చార్జిలు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌సభ్యుడు బీఎస్ కృష్ణారెడ్డి, నాయకులు తలారిమస్తానప్ప, ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్, గుమ్మనూరు వెంకటేష్, గుజరిమహ్మద్ ఖాజా, అంజి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం

గుంతకల్లు: సీఎం చంద్రబాబు మహిళాభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయ భవనంలో బుధవారం ఉదయం ఆయన పొదుపు సమాఖ్యల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనిధి ద్వారా విడుదలైన రూ. 2.22 కోట్ల చెక్కును పొదుపు సంఘాల నాయకురాళ్లకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పొదుపు సంఘాల వికాసానికి సీఎం చంద్రబాబు నిరంతర కృషి చేశారన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు కలిపి రూ. 12.55 కోట్ల శ్రీనిధి ఫండ్ రాగా.. అందులో గుంతకల్లు పట్టణానికి రూ. 2.22 కోట్లు విడుదల చేశారని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైన కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి, విద్యుత్ సమస్య, సీసీ రోడ్లు లేకపోవడం, అపరిశుభ్రత తదితర సమస్యల్ని కౌన్సిలర్లు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఆయా కాలనీల్లో సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి సమస్యను పరిష్కరించి, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆ దిశగా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. తర్వాత నూతనంగా ఎన్నికైనా సాగునీటి సంఘాల అధ్యక్షులు ఎమ్మెల్యేను కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, టీడీపీ మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, పట్టణ అధ్యక్షులు శర్మాస్ వలి, నాయకులు డిష్‌మురళి, రాజశేఖర్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమిలినేనిని కలిసిన పరిటాల సునీత

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఓ వివాహ వేడుకకు వచ్చిన ఆమె స్థానిక ఎమ్మెల్యే అమిలినేని ఇంటికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. సురేంద్రబాబు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అలాగే శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తర్వాత కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధి, రాజకీయ అంశాలపై కొద్దిసేపు వారు చర్చించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.


పరిటాల సునీతకు జ్ఞాపికను అందిస్తున్న అమిలినేని

క్లుప్తంగా..

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

ఉరవకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్ల కొండపై వెలసిన గురుసయ్యద్ మీరా మహమ్మద్ అష్రఫ్‌షా ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. భక్తులు పెద్దఎత్తున స్వామి వారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే చక్కెర చదివింపులు చేయించారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

యాడికి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లబ్ధిదారులు నిర్దేశిత గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని హౌసింగ్ గుంతకల్లు డివిజనల్ ఈఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని చందన రోడ్డులో హౌసింగ్ నిర్మాణ పనులను, సిమెంట్ స్టాక్ గోడౌన్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పీఎంఏవై లబ్ధిదారులు హౌసింగ్ నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట తాడిపత్రి డీఈఈ షాషావలి, హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్ ఉన్నారు.

ప్రతి కూలీకి 200 పనిదినాలు కల్పించాలి : డ్వామా పీడీ

రాయదుర్గంరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతి కూలీకి 200 పని దినాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పీడీ సలీంబాషా సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కూలీకి పనిదినాలు 200లకు తగ్గకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అదే విధంగా రోజుకి ప్రతి కూలీకి 300 రూపాయల కూలి పడేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండేలా చూడాలన్నారు. గోకుల్‌షెడ్ నిర్మాణం పనులు వేగవంతం చేయించాలని సూచించారు. ఉపాధి పథకంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో కొత్తపనులు గుర్తింపునకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, పీసీ భారతి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి అవగాహన సదస్సు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులకు, సిబ్బందికి పీడీ సలీం బాషా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని పీడీ సలీబాషా తెలిపారు. ఎంపీడీవో నంద కిషోర్, ఏపీవో పండరీష్, జేఈ జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు అవినాష్ మంజునాథ్, వన్నూరుస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కోఆప్షన్ సభ్యుడిపై పోలీసులకు ఫిర్యాదు

గుంతకల్లుటౌన్,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మహబుబ్ బాషాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. జనసేన మండల అధ్యక్షుడు కురువ పురుషోత్తం బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం అనంతపురం వైసీపీ నాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్ మహబుబ్ బాషా సోషల్ మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ సీఎం చంద్రబాబు 420, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జోకర్ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కనుక అతడిపై చర్యలు తీసుకోవాలని రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత పట్టణ అధ్యక్షుడు పాండుకుమార్, జనసేన నాయకులు మహమ్మద్‌గౌస్, ఫిరోజ్ ఖాన్, దాదు, శీను, కాంత, సురేష్, సమీర్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

గుంతకల్లుటౌన్ : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలుతగవని, వారిపై వాఖ్యలు చేసిన వైసీపీ కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మహబుబ్‌బాషా నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ మైనార్టీ నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని పార్టీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం వారు మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై మాట్లాడే అర్హత మహబుబ్‌బాషాకు లేదు. జగన్ ప్రభుత్వంలో మైనార్టీలకు ఒరిగేందేమీ లేదని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వారిపై విమర్శలు చేయడం తగదన్నారు. ఇకపై విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామని, ఇకనుంచైనా నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. టీడీపీ మైనార్టీ నాయకులు గుజరిమహ్మద్‌ఖాజా, అహ్మద్‌బాష, షేక్ ఫజులు, ఫ్రూట్‌మస్తాన్, పప్పూరు మహబుబ్‌బాషా, టెంకాయల యూసఫ్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ వితరణ

గుంతకల్లు టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి బళ్లారికి చెందిన చంద్రశేఖర్, కరుణాకర్‌లు ట్రాక్టర్‌ను ఆలయ ఈఓ స్వాతికి బుధవారం అందజేశారు. సుమారు రూ.10 లక్షలు విలువచేసే ట్రాక్టర్‌ను అందజేశారు. అనంతరం దాతలకు అర్చకులు స్వామి దర్శనం చేయించి, వారి పేరట అర్చనలు చేశారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

బాలికా వికాసంపై శిక్షణ

విడపనకల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాలికా వికాసం పై శిక్షణను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని తెలిపారు. బాలల హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు ఉమారాణి, ఏఓ భాస్కర్, వైద్యుడు రాజేంద్ర, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానపంటల పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన


బసంపల్లిలో చీనీతోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి గౌసియా

శెట్టూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉద్యాన పంటలకు తెగుళ్లు సోకుతున్నా.. ఉద్యానవన శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితమైంది. ఇందుకు ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఉద్యానవన శాఖాధికారిణి గౌసియా మండలంలోని బసంపల్లిలో చీనీ తోటలను పరిశీలించి చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు తెలిపారు. ఆమె వెంట విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆమని, రైతులు పాల్గొన్నారు.

తాడిపత్రి ప్రజలకు అండగా ఉంటాం

- సపోజ్ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి తమ కుటుంబం పట్ల ఆప్యాయత, అనురాగాలు చూపించడంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన సపోజ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించి బాధ్యతలను మరింత పెంచారని అన్నారు. ఈ బాధ్యతలు నెరవేర్చడానికి నిత్యం కృషి చేస్తానన్నారు. తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలబెడదామని, అందకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా పట్టణాన్ని పచ్చదనంగా, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి క్రైస్తవులకు దగ్గరుండి భోజనం వడ్డించారు. వేడుకల్లో చర్చి ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

గుత్తి: క్రైస్తవుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్ద పీట వేశారని టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంబీఏ కళాశాల ఆవరణలో క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం క్రైస్తవులను అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. తొలిబడ్జెట్ సమావేశంలోనే క్రైస్తవుల సంక్షేమ కోసం రూ.151కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. అదే విధంగా క్రైస్తవులకు క్రిస్మస్ చేసుకోవడానికి జిల్లాకు రూ.లక్ష నిధులు విడుదల చేశారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ఉరవకొండ: పట్టణంలోని శాలెం క్రిస్టియన్ చర్చిలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీపీటీడీఈపీఎఫ్ అధ్యక్షుడు శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. మానవులను సన్మార్గంలో నడిపించడమే క్రిస్మస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీపీటీడీఈపీఎఫ్ కార్యదర్శి అంకరాజు, సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు: ఆర్డీఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత్‌బాబు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఆవులదట్లలో బుధవారం సర్పంచ్ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఆర్డీఓ పాల్గొని మట్లాడారు. ఏవైనా చిన్న చిన్న భూమి సమస్యలుంటే రైతులు అర్జీల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. 45 రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. 11 మంది అర్జీలు ఇచ్చినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కల్లగళ్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 55 మంది రైతులు అర్జీలు ఇచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్ తెలిపారు. మండల సర్వేయర్ ఆయేషా సిద్దికి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని నాగసముద్రంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు రమాదేవి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పెషలాఫీసర్, దేవాదాయ శాఖ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని నీలూరు, గజరాంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. నీలూరులో 17, గజరాంపల్లిలో 20 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీధరమూర్తి పేర్కొన్నారు. ఎంపీడీఓ తేజోత్స్న, రీ సర్వే డీటీ విజయ్, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు మారుతివరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు : మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఈశ్వరశెట్టి తెలిపారు. రెవెన్యూ, సచివాలయాల అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని కరిగానపల్లిలో జరిగిన సదస్సులో పలు భూ సమస్యలపై రైతులు తహసీల్దార్ పీ శ్రీనివాసులుకు విన్నవించారు. వీఆర్వోలు నరసింహమూర్తి, తిమ్మప్ప, సర్వేయరు సర్పంచ్ నాగేంద్ర, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలపై 12 మంది రైతులు అర్జీలు ఇచ్చారని తహసీల్దార్ షర్మిల తెలిపారు. సర్పంచ్ పెద్దన్న, ఆర్‌ఐ రమాదేవి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: నియోజకవర్గంలోని లత్తవరం, ప్యాపిలి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాలలో తహసీల్దార్లు మహబూబ్ బాషా, నసీర్ అహ్మద్‌లు వేర్వేరుగా పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని సంతే కొండాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు వివిధ భూ సమస్యలపై తహసీల్దార్ సుమతికి అర్జీలు ఇచ్చారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్‌మల్లెల వనిత, భూములకు సంబంధించిన సమస్యలను అర్జీరూపంలో ఇచ్చి వాటిని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సుమతి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గలవారు తమ బయోడేటాతో పాటు ఒరిజినల్ మార్క్సుకార్డు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పెద్దపప్పూరు, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అశోక్ కుమార్ రెడ్డి తనను కులం పేరుతో దూషించాడని నాగరాజు అనే వ్యక్తి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అశోక్‌కుమార్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఇసుక టిప్పర్లు సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లి టోల్ ప్లాజా వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే వాటిపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

పొలంలోకి దూసుకెళ్లిన లారీ


రివర్స్‌లో పొలంలోకి దూసుకెళ్లిన లారీ

బొమ్మనహాళ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్‌లో ఓ లారీ బుధవారం సాయంత్రం పొలాల్లోకి రివర్స్‌లో దూసుకెళ్లింది. ధాన్యం లోడుతో ఉన్న లారీ అన్నపూర్ణ రైస్‌మిల్ వద్ద ఉన్న వేబ్రిడ్జి కాటా వేసుకుని రివర్స్ చేసుకుంటుండగా ఒక్కసారిగా పొలంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఆసరా కోసం ఎదురుచూపులు!

- గత ప్రభుత్వంలో పలువురి పింఛన్ల తొలగింపు
- అర్హతలున్నా అమానుషంగా కోత
- నాటి నుంచి ఇబ్బందుల్లో బాధితులు
- కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశలు

డి.హీరేహాళ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పింఛన్ లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. చంద్రబాబు సీఎం అయ్యాక ఎన్నికల్లో చెప్పిన హామీ మేరకు గతంలోని పింఛన్లను రూ. 4 వేలకు పెంచి ఒకటో తేదీనే పంపిణీకి చర్యలు తీసుకున్నారు. దీంతో గత ప్రభుత్వంలో అమానుషంగా పింఛన్ కోల్పోయిన వారు, అలాగే కొత్తగా పింఛన్‌కు అర్హత పొందిన వారి ఆశలకు రెక్కలొచ్చాయి. నూతన పింఛన్ల కోసం వారు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

అమానుషంగా పింఛన్ల తొలగింపు

గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలో చాలామంది అర్హులకు పింఛన్లను అమానుషంగా తొలగించి వృద్ధులు, దివ్యాంగుల జీవితాలతో చెలగాటమాడారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో సుమారు 4,864 పింఛన్లు ఉండగా 2020 వ సంవత్సరంలో పొంతన లేని నిబంధనలతో 286 పింఛన్లను తొలగించారు. దీంతో పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న వారి జీవితం అగమ్యగోచరంగా తయారైంది. అప్పుడు పింఛన్ కోల్పోయిన వారు నేటి వరకు కూడా.. అన్ని అర్హతలున్నా పింఛన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం అనాలోచిత నిబంధనలతో పింఛన్లకు కొరివి పెట్టిందని, ఈ ప్రభుత్వమైనా అప్పుడు పింఛన్లు కోల్పోయిన తమకు తిరిగి న్యాయం చేస్తుందేమోనని బాధితులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మందులకు కూడా ఇబ్బందిగా ఉంది



గత 15 ఏళ్లకు పైగా నాకు వృద్ధాప్య పింఛన్ వస్తుండేది. ఆ డబ్బుతోనే ఎవరి మీద ఆధారపడకుండా సొంత అవసరాలకు, మందులకు సరిపెట్టుకునేదాన్ని. అయితే గత రెండున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో ఒకే రేషన్‌కార్డుపై తనకు వృద్ధాప్య, తన కోడలకు వితంతు పింఛన్ వస్తోందన్న కారణంతో తన పింఛన్ నిలిపివేశారు. అప్పటి నుంచి నేటి వరకు మందులు కొనేందుకు కూడా ఇబ్బంది పడుతున్నా. ఇప్పటి ప్రభుత్వం అయినా తనకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

- కావలి సుంకమ్మ, పులకుర్తి గ్రామం

త్వరలోనే పరిష్కరిస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెలలో నూతన పెన్షన్లకు సంబంధించి ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీనికి సంబంధించి ఇప్పటికే అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. ఈ పింఛన్లకు సంబంధించి సైట్ ఓపెన్ అయిన తర్వాత ఆయా గ్రామాలలోని సచివాలయాల్లో అర్హత కలిగిన లబ్ధిదారులు పింఛన్ దరఖాస్తులను స్వీకరిస్తాం. అన్ని అర్హతలు కలిగిన వారికి మంజూరు చేస్తాం. గతంలో పింఛన్లు కోల్పోయినటు వారిని కూడా గుర్తించి, అర్హులని తెలియ వస్తే వారికి కూడా మంజూరు చేసేందుకు కృషి చేస్తాం.

- రఘునాథ్, ఎంపీడీఓ

గడ్డివామి దగ్ధం

పెద్దవడుగూరు, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి సర్పంచు వెంకటరమణారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిలకు చెందిన గడ్డివాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటనలో దాదాపు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. బాధితులు వైసీపీ నాయకులు కావడంతో గ్రామంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

షెడ్లను వెంటనే ఖాళీ చేయండి

యల్లనూరు, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ ద్వారా నిర్మించిన షెడ్లను వెంటనే ఖాళీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. కూచివారిపల్లి, వాసాపురం గ్రామాల్లోని షెడ్లలో పలువురు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ బుధవారం వారితో మాట్లాడారు. వర్మీకంపోస్టును తయారుచేసే ఈషెడ్లను నివాసాలు ఏర్పాటు చేసుకోవడమేంటని ప్రశ్నించారు. వారం రోజుల గడువు ఇస్తున్నామని, ఖాళీ చేయాలని తెలిపారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ గోపాల్‌నాయుడు ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కణేకల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన హరిజన తిమ్మన్న అనే వ్యక్తి హనుమాపురం గ్రామం వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. తిమ్మన్న స్థానికంగా బొగ్గుల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బుధవారం బొగ్గులకు అవసరమైన మొద్దుల కోసం హనుమాపురానికి వెళ్లాడు. అయితే సాయంత్రం హనుమాపురం గ్రామ పరిసరాలలో ఆయన అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నాగమధు సంఘటన స్థలానికి చేరుకుని మృతికి గల వివరాలను ఆరా తీసి అనుమానాస్పద స్థితిగా కేసు నమోదు చేసుకున్నారు.

గుత్తి స్పెషల్ సబ్‌జైలు తనిఖీ

గుత్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ లీగల్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్, ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం. శ్రీహరి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైలు బ్యారేక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూములను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఖైదీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సబ్‌జైలులో 70 ఏళ్లు నిండిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. వయస్సు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సబ్‌జైలుకు వచ్చిన వెంటనే వివరాలను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జైలర్ మహేశ్వరుడు, న్యాయవాదులు గంగాధర్, కుమార్, నరసింహనాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

బొమ్మనహాళ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాలలోని సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం ఎంత మొత్తంలో వస్తోంది. సీరియల్ క్రమంలో తూకం వేస్తున్నారా లేదా అని పరిశీలించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను అలాట్ అయిన రైస్ మిల్లులకు వెంటనే పంపించాలని సూచించారు. ట్యాబ్ డేటా ఎప్పటికపుడు అప్‌డేట్ చేయాలని, రిజిస్టర్లలో వరి ధాన్యం కుప్పలను సీరియల్ క్రమంలో ఎంట్రీ చేయాలని టెక్నీషియన్‌కు సూచించారు. తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు ,వ్యవసాయాధికారి సాయికుమార్ ఉన్నారు.

చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రిడ్స్ జిల్లా కో ఆర్డినేటర్ జయమ్మ హెచ్చరించారు. పట్టణంలోని పలు దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు మెకానిక్ షాపులు, సర్వీసింగ్ సెంటర్లు, వెల్డింగ్ షాపులలో 18 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు, షాపు యజమానులను పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం జువెనల్ జస్టిస్ చట్టం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాంభూపాల్, ఏఎస్‌ఐ కృష్ణ, లేబర్ ఆఫీసర్ రమాదేవి, డీసీపీవో వెంకట్, రిడ్స్ మండల కో ఆర్డినేటర్ బాలరాజు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కళ్యాణదుర్గం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరంపల్లిలో గల ఓ వ్యవసాయ తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతులు వన్నూరుస్వామి, ఎర్రిస్వామి, శర్మాస్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముగ్గురు రైతులు పంటలకు నీరు పెట్టుకునేందుకు ఉమ్మడిగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కాగా బుధవారం ఉదయం పొలాల్లోకి మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసమై కనిపించింది. అందులో ఉన్న కాపర్ వైరు, ఆయిల్ కనపడలేదు. దీంతో చోరీ జరిగిందని వారు గుర్తించారు. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో పంటలకు నీరు పెట్టుకోలేలేమని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. జరిగిన సంఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి చోరీలు కళ్యాణదుర్గం నియోజకర్గంలో రోజురోజుకీ ఎక్కువైపోతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు పట్టించుకోకుండా మౌనంగా ఉన్నట్లు వారు అసహనం వ్యక్తం చేశారు.


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్